క్లుప్తంగా

బాలరాజును కలిసిన కొండబాబు


బాలరాజును సత్కరిస్తున్న పార్టీ నేతలు

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల గ్రామానికి చెందిన సుంకర కొండబాబుకు వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీగా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కొండబాబు ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న రోజుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు యువత ముందుకు వచ్చేలా పనిచేయాలని ఈ సందర్భంగా బాలరాజు సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు


సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు సమర్పిస్తున్న కేదాసు కుటుంబీకులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని తాడేపల్లిగూడెం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఇప్పటివరకు రూ.35 లక్షల విరాళాల రూపంలో సమకూరినట్లు పాలకమండలి చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ ఆదివారం పేర్కొన్నారు. సుమారు రూ.45 లక్షల అంచనాతో సింహపురి హోటల్స్ యజమాని ఎంవీఆర్ విరాళంగా ఇచ్చిన మూడున్నర సెంట్ల స్థలంలో నిర్మాణం కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం గోపురం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని నవంబర్‌లోగా నిర్మాణం పూర్తి చేసి సుబ్రహ్మణ్యషష్ఠి ఉత్సవానికి ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు.

పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గం


అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) ఏలూరు జిల్లా అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావుల సమక్షంలో కొయ్యలగూడెం మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆనందం సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా ఉండ్రాజవరపు భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా రాయపూడి మురళీకృష్ణ, సహాయ కార్యదర్శిగా గాలంకి శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎన్‌జీఎన్‌వీవీ సత్యనారాయణలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


భగవద్గీత ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

పెదవేగి: శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అన్నారు. త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో ఆదివారం ఏలూరు జిల్లా, పెదవేగి మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ జ్ఞాన వేదిక నూజివీడు అధ్యక్షుడు మాట్లాడుతూ దేవుడే ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అంటారని, అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు, ఆయనను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలని అన్నారు. పూర్వం శ్రీకృష్ణాష్టమి 11 రోజుల పాటు చేసేవారు చివరిగా చవితి రోజున ఊరేగింపు చేసి ముగించేవారని ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, వంశీ, రామాంజనేయులు, శేఖరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నర్సింగ్ విద్యార్థులు

దెందులూరు: బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సిద్దిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో ఆదివారం నర్సింగ్ విద్యార్థులు మొక్కలు నాటారు. కరస్పాండెంట్ నూకరాజు మాట్లాడుతూ ఈ మొక్కలను సంరక్షించే బాధ్యత కూడా తమదేనని, వాటికి త్వరలోనే ట్రీ గార్డులు ఏర్పాటు చేస్తామని అన్నార

శిథిలావస్థలో ధర్మాజీగూడెం పశువైద్యశాల


శిథిలావస్థలో పశువైద్యశాల


భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపోయిన దృశ్యం


అసంపూర్తిగా నూతన భవన నిర్మాణం

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, సిబ్బంది
- ఏళ్లతరబడి అసంపూర్తిగా నూతన భవన నిర్మాణం

లింగపాలెం: ధర్మాజీగూడెం పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ పెచ్చులూ ఊడిపడడంతోపాటు వర్షం నీటితో మందులు, ఫైళ్లు, ఫర్నిచర్ తడిసిపోవడంతో సిబ్బంది, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు మండలాల్లోని 15 పశు వైద్యశాలలకు కేంద్రంగా ఉన్న ధర్మాజీగూడెం ఏరియా పశువైద్యశాలలో సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. ఈ ఆసుపత్రి భవనాన్ని 1977లో నిర్మించారు. భవనంలోని శ్లాబ్ పెచ్చులు, పెచ్చులుగా ఊడిపోతుంది. దీంతో వర్షం నీరంతా భవనంలోనే ఉంటుంది. ప్రస్తుతం పశువులు, గొర్రెలు, మేకలు, శునకాల సంఖ్య పెరగటంతో ఆసుపత్రి విస్తీర్ణం సరిపోవడం లేదు. ఏరియా హాస్పటల్ కావడంతో ఇక్కడ నుంచి కామవరపుకోట, ముసునూరు, లింగపాలెం మండలాల్లోని 15 హాస్పటల్స్‌కు మందులు పంపిణీ చేస్తున్నారు. మందులను నిల్వ ఉంచేందుకు భవనంలో సదుపాయాలు లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

అసంపూర్తిగా నూతన భవన నిర్మాణం

ధర్మాజీగూడెం పశు వైద్యశాల నూతన భవన నిర్మాణానికి 9 ఏళ్ల క్రితం నాబార్డ్ రూ.కోటి నిధులను మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులు కూడా 75 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో భవన నిర్మాణం పూర్తి కావడం లేదు. ఏళ్ల తరబడి భవన నిర్మాణం పూర్తికాకపోవడం, పాత భవనం శిథిలావస్థకు చేరడంతో పశువుల పెంపకం దారులు, రైతులు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా ఈ భవన నిర్మాణం గురించి పట్టించుకోకపోవటంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశువైద్యశాల నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రైతులు కోరుతున్నారు.

గణపతి ఆలయాన్ని సందర్శించిన ఎస్పీ


గణేష్ సెంటర్లో గణపతి ఆలయానికి విచ్చేసిన ఎస్పీ

కొయ్యలగూడెం: గణపతి యువజన సేవా సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ పేర్కొన్నారు. ఆదివారం గణేష్ సెంటర్ కి విచ్చేసిన సందర్భంగా నూతనంగా నిర్మించిన గణపతి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు 80 సంవత్సరాల నుంచి గణపతి యువజన సేవా సంఘం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూనే గ్రామాభ్యుదయానికి రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైన ఆస్తులను దానంగా ఇచ్చిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా పాలకమండలి అధ్యక్షుడు మట్ట సూర్యచంద్రం మాట్లాడుతూ నూతన ఆలయ నిర్మాణానికి పోలీస్ శాఖ అందించిన కృషికి గ్రామస్తులు తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంకు కొండ పాలకి, మండల సభ్యులు పాల్గొన్నారు.

మద్దిరావమ్మ సంబరాలు

దెందులూరు: దెందులూరులో శ్రీమద్దిరావమ్మ సంబరాలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే శ్రీమద్దిరావమ్మ సంబరాలు ఐదు వారాల పాటు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సంబరాల్లో భాగంగా గ్రామంలో భక్తులు నిప్పుల అగ్ని గుండం తొక్కి భక్తిని చాటుకుంటారు.

ప్రత్యేక గురుకులం కావాలి

ఏలూరు (టూటౌన్): సంచార జాతుల విద్యార్థుల కోసం జిల్లా కేంద్రంలో ప్రత్యేక గురుకుల పాఠశాలను ఏర్పాటుచేయాలని నవ్యాంధ్రప్రదేశ్ గిరిబలిజ సంక్షేమ సంఘం వర్కింగ్‌ప్రెసిడెంట్ అన్నపరెడ్డి మురళి కోరారు. స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్ నందు సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సంచార జాతుల వారు విద్యారంగంలో అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఘంటశాల వెంకటలక్ష్మి, బీసీ కులాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లంకా వెంకటేశ్వరరావు, ఘంటా ప్రసాదరావు, సంగర సంఘం అధ్యక్షులు తాడిశెట్టి గోపి, ముస్లిం సంచార జాతుల అధ్యక్షుడు జావీదు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా యువజన కమిటీ నియామకం


కనుపర్తి రాజేష్


మహమ్మద్ ఉమర్ షరీఫ్

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శులుగా జంగారెడ్డిగూడెం మండలం కట్టపాదలవారిగూడెం గ్రామానికి చెందిన కనపర్తి రాజేష్, మహమ్మద్ ఉమర్ షరీఫ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు వారు తెలిపారు. తమకు ఈ పదవికి రావడానికి సహకరించిన పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాథరావు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజ, జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నానిలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో యువతను పార్టీకి మమేకం చేసి పార్టీ అభివృద్ధికి పాటుపడతామని, రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేసే వరకు పార్టీకి అంకితభావంతో పని చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కుక్కల ధర్మరాజు, పార్థసారథి, మల్నీడి బాబి, జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు, మండల ప్రెసిడెంట్ నాగేంద్ర, జెట్టి ఆదిత్య, ప్రధాన కార్యదర్శి చిత్తపూరి శేఖర్, గుబ్బల వెంకటేశ్వరరావు, వీరవల్లి సోమేశ్వరరావు, కుద్రు రవి, జమీర్, కడిమి కిరణ్, పోతన జ్ఞాని, హేమంత్, నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రారంభోత్సవం ఎప్పుడో?

- పూర్తయిన సచివాలయ నూతన భవన నిర్మాణాలు
- వెంటనే ప్రారంభించాలని స్థానికుల డిమాండ్


ధర్మాజీగూడెంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సచివాలయ భవనం

లింగపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సచివాలయ భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోపోవటంతో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలో మొత్తం 19 సచివాలయ భవనాలకు నిధులు మంజూరయ్యాయి. ఒకొక్క భవన నిర్మాణానికి రూ.40 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. అయితే వీటిలో 12 సచివాలయాల భవనాలను గత ప్రభుత్వంలో ప్రారంభోత్సవం చేయటంతో ఉద్యోగులు ఆ భవనాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని కారణాలతో తోచలకరాయుడుపాలెం, కొత్తపల్లి, రంగాపురం, ధర్మాజీగూడెం-2లో భవన నిర్మాణం పనలు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. ధర్మాజీగూడెం-1, లింగపాలెం, మఠంగూడెం గ్రామాల్లో కూడా సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తికాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సమయంలో సాధారణ ఎన్నికల కోడ్ రావటంతో వీటి ప్రారంభోత్సవం నిలిచిపోయింది. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ఆ మూడు గ్రామాల్లో పూర్తయిన సచివాలయ భవనాలను ప్రారంభించడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో ఇరుకు భవనాల్లో ఉద్యోగులు విధులు నిర్వర్తించటం, మరోవైపు సచివాలయాలకు వెళ్లిన ప్రజలకు సరైన సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే సచివాలయ నూతన భవనాలను ప్రారంభోత్సవం చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు.

మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం


మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమం అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. ప్రతి ఆదివారం హనుమద్ హోమ కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహిస్తున్నామని, భక్తులు సద్వినియోగం చేసుకుని స్వామివారి కృపను పొందాలని కోరారు. కార్యక్రమాన్ని ఆలయ పర్యవేక్షకులు రాజ్‌కుమార్ పర్యవేక్షించారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

మద్ది క్షేత్రంలో సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. 1వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి భక్తులకు స్వామి వారి గర్భాలయ దర్శనం నిలుపుదల చేసి తిరిగి 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పునఃప్రారంభించనున్నట్లు ఈవో తెలిపారు.

లక్ష్య సాధనకు ఇష్టంతో చదవాలి


కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

భీమడోలు: విద్యార్థి దశ నుంచి తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు ఇష్టంతో చదవాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఎఫైర్స్, పుస్తక ప్రదర్శన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. తమ లక్ష్య సాధనలో గ్రంథాలయాల పాత్రపై వారికి వివరించారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పుస్తక ప్రదర్శన చేశారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎస్‌టీ అమర్‌నాథ్, కె.శ్రీనివాసరావు, బంగారు పాప, ఉపాధ్యాయుడు మండే సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న వైఎస్సార్ విగ్రహాలు

- రేపు వైఎస్సార్ వర్ధంతి
- రాజా పంగిడిగూడెంలో అన్నసమారాధనకు ఏర్పాట్లు


ద్వారకాతిరుమలలో వైఎస్సార్ విగ్రహానికి రంగులు వేస్తున్న దృశ్యం


రాజా పంగిడిగూడెంలో వైఎస్సార్ విగ్రహాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను పార్టీ శ్రేణులు ముస్తాబు చేస్తున్నారు. అందులో భాగంగా విగ్రహాలను శుభ్రం చేయించి, రంగులు వేయిస్తున్నారు. ఈనెల 2వ వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ద్వారకాతిరుమల, రాజా పంగిడిగూడెం గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో ఉన్న వైఎస్సార్ విగ్రహాలను రంగులతో ముస్తాబు చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వర్ధంతి కార్యక్రమాల్లో భాగంగా రాజా పంగిడిగూడెంలో 2వ తేదీ మధ్యాహ్నం భారీ అన్నసమారాధనను నిర్వహిస్తామని పార్టీ గ్రామ కమిటీ తెలిపింది. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని కోరారు.

అట్టహాసంగా గణేష్ నిమజ్జనాలు


బుట్టాయగూడెం: దుద్దుకూరులో తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి సందడి


జంగారెడ్డిగూడెం: అన్నసమారాధన ప్రారంభించిన జెట్టి


ద్వారకాతిరుమల: రాళ్లకుంటలో ఊరేగుతున్న గణేషుడు


జంగారెడ్డిగూడెం: పట్టణంలో గణేష్ ఊరేగింపు

బుట్టాయగూడెం: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా పూజలు అందుకున్న పలు వినాయక విగ్రహాలను ఆదివారం వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. దుద్దుకూరులో జరిగిన నిమర్జన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. వినాయకుని ఊరేగింపులో భక్తిపాటలకు నృత్యాలు చేసి సందడి చేశారు. తొలుత గణపతికి నైవేద్యంగా సమర్పించిన 5 కిలోల లడ్డూ ప్రసాదాన్ని శేషాద్రి గ్రూప్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు రూ.8,901 కు వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అదేవిధంగా బుట్టాయగూడెం, దొరమామిడి, ముప్పినవారిగూడెం గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అలాగే పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

ఉత్సాహంగా గణేష్ ఊరేగింపులు

ద్వారకాతిరుమల: మండలంలోని రాళ్లకుంట, దొరసానిపాడు గ్రామాల్లో గణేష్ ఊరేగింపు, నిమజ్జన వేడుకలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ముందుగా ఉత్సవ కమిటీల సభ్యులు గణనాథుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి, పూజలు చేశారు. అనంతరం తీన్మార్ డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్లతో గ్రామాల్లో ఊరేగించారు. ఆఖరిలో స్థానిక కోనేరుల్లో గణేష్ నామస్మరణల నడుమ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

జంగారెడ్డిగూడెం మండలంలో...

జంగారెడ్డిగూడెం: పట్టణం, రూరల్ గ్రామాల నుంచి గణనాథులకు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని అలంకరించిన వాహనాల్లో డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్ సిస్టంతో కోలాహలంగా నిమజ్జనోత్సవానికి తీసుకువెళ్లారు. మండలంలోని కేకేఎం ఎర్రకాలువ జలాశయంలో నిమజ్జనం చేశారు. స్థానిక త్రివేణీ కళాశాల వెనుక డ్యూప్లెక్స్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడికి తొలుత పూజలు నిర్వహించి, అనంతరం యువకులు థార్ రాక్స్ వాహనంపై నిమజ్జనానికి తీసుకువెళ్లారు. ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. బస్టాండ్ వద్ద, చందన బ్రదర్స్, సాయిబాలాజీ టౌన్ షిప్, జెడ్పీ హైస్కూల్ వద్ద, పట్టణంలోని మరికొన్ని ప్రాంతాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు, పార్టీ నాయకులు ప్రారంభించారు.

కొయ్యలగూడెం: గణనాథుల ఊరేగింపు ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రులలో భాగంగా ఐదవ రోజు అన్న సమారాధనలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వాటర్ ట్యాంక్ శ్రీరామ్ నగర్‌లోని శ్రీ బాల విఘ్నేశ్వరుని ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు.

ప్రగడవరంలో...

చింతలపూడి: ప్రగడవరంలో బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో చిన్నారులు ఏర్పాటుచేసిన బాల గణేష్ విగ్రహాన్ని ఆదివారం గ్రామంలోని వీధుల్లో మేళ తాళాలు, తీన్మార్ డప్పుల నడుమ ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు.


జంగారెడ్డిగూడెం: లక్కవరంలో వినాయకుడి ఊరేగింపు


కొయ్యలగూడెం: వాటర్ ట్యాంకు రామాలయం వద్ద ఇలా..


చింతలపూడి: ప్రగడవరంలో చిన్నారుల సందడి

కులవివక్షకు పాల్పడితే కఠిన చర్యలు

గణపవరం: అన్ని వర్గాల ప్రజలు సమానమని, అందరూ కలిసిమెలిసి జీవించాలని, ఎవరైనా కులవివక్షకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నా రు. ఆదివారం గణపవరం మండలం వెలగపల్లి గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ అధ్యక్షతన సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలను కులం పేరుతో దూషించినా, కించపరిచినా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పౌరహక్కుల కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు.

ఉద్యాన పంటలకు రాయితీ

ఉంగుటూరు: ఉద్యాన వన తోటలు వేసుకునే రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీ అందిస్తోందని మండల ఉద్యానవన శాఖ అధికారి అమరనాథ్ వెల్లడించారు. మామిడి తోటలకు ఎకరాకు రూ.50 వేలు రాయితీ కల్పిస్తారని, మొదటి సంవత్సరం రూ.30 వేలు, రెండో సంవత్సరం రూ.20 వేలు అందజేస్తారని తెలిపారు. ఒక రైతు రెండున్నర హెక్టార్ల వరకు పరిమితమని చెప్పారు. జామకు రూ.80 వేలు, నిమ్మకు రూ.50 వేలు, కోకో పంటకు రూ.30 వేలు, సీతాఫలానికి రూ.30 వేలు, టీసీ అరటికి రూ.70 వేలు, బొప్పాయికి రూ.30 వేలు, డ్రాగన్ పంటకు రూ.2.70 లక్షలు, వాక్కాయకు రూ.30 వేలు చొప్పున రాయితీ రెండేళ్లలో అందిస్తారని తెలిపారు.